క్లుప్తంగా

రేపు అరుణాచలంకు ప్రత్యేక బస్సు

సత్తెనపల్లి: సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలంకు ఈ నెల 10న రాత్రి 09.00 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ (2+2 పుష్ బ్యాక్) బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 11న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అదే రోజు రాత్రికి అరుణాచలం చేరి దర్శనం అనంతరం తిరిగి ఈ నెల 12న కంచికి చేరి కంచి దర్శనం అనంతరం రాత్రికి బస్సు బయలు దేరి ఈ నెల 13న ఉదయం సత్తెనపల్లి చేరుతుందన్నారు. టికెట్ ధర రాను పోను ఒక్కొక్కరికి రూ.2,500 మాత్రమేనన్నారు. భక్తులు, యాత్రికులు ఈ సదవకాశమును వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9959225429, 7382897583, 7382896966, 7382897116 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్వతంత్ర వీరుడు వడ్డే ఓబన్న విగ్రహ నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం శంకుస్థాపన చేశారు. త్వరితగతిన విగ్రహ నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి తదితరులు ఉన్నారు.

పెట్రోల్‌బంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన భారత్ పెట్రోలియం పెట్రోల్‌బంక్‌ను సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కొత్త రైస్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి



సత్తెనపల్లి: బియ్యం కార్డులు లేని వారు, ఉన్న వాటిల్లో లోపాలతో ఇబ్బందులు పడుతున్న వారి సమస్యలకు పరిష్కారం లభించనుందని సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి గురువారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ సహాయకుల వద్దకు వెళ్లి దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. బియ్యం కార్డులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న సమీపంలోని సచివాలయాలకు వెళ్లి తగిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మొత్తం 7 రకాల సేవలు అందుతాయన్నారు. వాటిలో ప్రధానంగా కొత్త బియ్యం కార్డు, సభ్యులను కొత్తగా చేర్చడం, కొంతమంది సభ్యులను విడదీసేందుకు అవకాశం, సభ్యుల తొలగింపు, సరెండర్, చిరునామా మార్పు, తప్పులు, ఆధార్ సీడింగ్ ఇతర సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హస్సన్ బాషాకు సత్కారం



సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారి గుంటూరు జిల్లాకు చెందిన హస్సన్ బాషా ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సత్తెనపల్లిలోని ఎకో ఓవర్సీస్ కార్యాలయంలో ముస్లిం సోదరులు గురువారం సమావేశమయ్యారు. ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా హస్సన్ బాషాను ముస్లిం సోదరులు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సయ్యద్ పెద్దకరీముల్లా, నాయకులు సయ్యద్ మహబూబ్, షేక్ మహబూబ్ షరీఫ్(దూదెకె), షేక్ ఖాశిం షరీఫ్, జాన్ బాబు తదితరులు ఉన్నారు.

దాడిచేసిన ఇరువురికి జైలు, జరిమానా

నాదెండ్ల: పాతకక్షల నేపథ్యంలో ఇరువురు వ్యక్తులు ఓ యువకుడిపై దాడిచేసి గాయపరచిన ఘటనలో చిలకలూరిపేట ఏజేసీజే న్యాయస్థానం ముద్దాయిలకు మూడు నెలల జైలు, రూ.3 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి స్వాతి తీర్పు వెలువరించారు. నాదెండ్ల పోలీసులు తెలిపిన వివరాల మేరకు 2018లో కనపర్రు గ్రామానికి చెందిన చీరాల అరవింద్ సాయిని అదే గ్రామానికి చెందిన చెవుల నరేంద్ర, చెవుల నాగాంజనేయులు దాడి చేసి గాయపరిచారు. అప్పటి ఎస్సై కొమ్మాలపాటి చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. గురువారం న్యాయస్థానం ముద్దాయిలకు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పుచెప్పింది. ఏపీపీగా కె జ్యోతి వ్యవహరించారు.

పాడవుతున్న పడవలు.. రోడ్డున పడ్డ కార్మికులు

- కూటమి ప్రభుత్వంలో మూతపడ్డ కస్తల ఇసుక రీచ్
- పనులు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- నష్టపోతున్న పడవల యజమానులు



కస్తలవద్ద కృష్ణానది ఇసుక రీచ్‌లో నిరుపయోగంగా పడి ఉన్న పడవలు

అచ్చంపేట: నాణ్యమైన ఇసుకకు పెట్టింది పేరు కస్తల రీచ్. ఈ రీచ్‌లో 200కు పైగా పడవలు కలిగిన యజమానులున్నారు. ఇసుక క్వారీపైన వెయ్యి మందికి పైగా కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ రీచ్ మూతపడటంతో ఇసుక క్వారీనే నమ్ముకున్న కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారు. రీచ్‌ను నమ్ముకుని లక్షల రూపాయలతో పడవలను తయారు చేయించుకున్న యజమానుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పడవలు చెదలు పట్టి పాడవుతున్నాయి. ఇక్కడ లభించే ఇసుకకు రాష్ట్రంలోనే మంచి గిరాకీ ఉంది. పెద్ద పెద్ద కట్టడాలకు ఇక్కడి ఇసుకనే వినియోగిస్తారు. గతంలో హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు ఇసుకను తరలించేవారు. నది లోతుల్లో నుంచి కూడా కార్మికులు ఇసుకను తోడుకుని, పడవను నింపి ఒడ్డుకు చేరుస్తారు. ఒక్కొక్క పడవలో ఒక లారీకి సరిపడ ఇసుకను నింపవచ్చు. ఈ రీచ్ కేవలం కూలీలతో మాత్రమే నడిచేది.

ట్రాక్టర్ల ద్వారానే ఇసుక రవాణా

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక రీచ్‌లలో యంత్రాలను ఉపయోగించకూడదు. కేవలం కూలీలతోనే లారీలకు లోడ్ చేయాల్సి ఉంది. కూలీలు అడ్డుపడతారు కాబట్టి కస్తల రీచ్‌ను పరిగణలోకి తీసుకోకుండా భారీ యంత్రాలు వినియోగించవచ్చన్న కారణంగా నిన్న మొన్నటి వరకు కోనూరు, అంబడిపూడి రీచ్‌లకు మాత్రమే బహిరంగ వేలం నిర్వహించారు. అక్రమార్కుల ఆగడాలు ఎక్కువ కావడంతో ఇప్పుడు ఆ రీచ్‌లు కూడా మూతపడ్డాయి. ఇప్పుడు ప్రస్తుతం ట్రాక్టర్ల ద్వారానే ఇసుక రవాణా జరుగుతోంది. మండలంలోని కొన్ని రీచ్‌లలో రాత్రి సమయాలలో యంత్రాల సహాయంతో లారీలకు ఇసుక నింపి రవాణా చేస్తున్న విషయం ప్రస్ఫుటంగా వినిపిస్తోంది. బడా రాజకీయ నాయకుల అండదండలతో ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోంది. అధికారులకు తెలిసినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

కళా విహీనం

ఒకప్పుడు వేలాది మంది కార్మికులు, నిత్యం వచ్చిపోయే లారీలు, ట్రాక్టర్లతో కళకళలాడే కస్తల ఇసుక రీచ్ ఇప్పుడు కళావిహీనమైంది. ఇక్కడ పనిచేసే కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారు. ఈ విషయాన్ని అనేక సార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళుతున్నా తమ మొర ఆలకించడం లేదని కార్మికులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోనూరు, అంబడిపూడి, కొత్తపల్లి రీచ్‌లకు బహిరంగ వేలం నిర్వహించిన అధికారులు, కస్తల రీచ్‌ని విస్మరించడం తమ దురదృష్టమని కార్మికులు వాపోతున్నారు.

➡ కోనూరులో నదికి అడ్డంగా రోడ్డు వేసి యంత్రాలతో లారీలకు ఇసుక నింపడంతో, అంబడిపూడిలో పూర్తిగా యంత్రాలనే ఉపయోగించడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి మూతేశారు.

ఒడ్డుకే పరిమితం

ఇసుక రీచ్‌ని నమ్ముకుని కస్తల గ్రామంలో 200కు పైగా పడవలను గ్రామస్తులు కొనుగోలు చేసుకున్నారు. ఒక్కొక్క పడవ సుమారు రూ.10 లక్షల విలువ చేస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రీచ్ పూర్తిగా మూతపడడంతో పడవలు ఒడ్డుకే పరిమితమయ్యాయి. దీంతో పడవలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాడవుతున్నాయని, ఉపాధి లేకపోగా లక్షలాది రూపాయల పడవలు పనికి రాకుండా పోతున్నాయని యజమానులు ఆందోళన చెందుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నారు



కస్తల రీచ్‌కు అధికారికంగా అనుమతులు లేకపోవడంతో ఇసుక అక్రమ మార్గంలో తరలి వెళుతుంది. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ట్రాక్టర్లు, లారీల యజమానులు బాగుపడుతున్నారే తప్ప దీనిపైనే ఆధారపడి జీవించే కార్మికులు, పడవల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– షేక్ మహబూబ్‌సుభాని, సర్పంచ్, కస్తల

న్యాయం చేయాలి



కస్తల ఇసుక రీచ్‌ను నమ్ముకుని వేలాది మంది కార్మికులు జీవించేవారు. ఇప్పుడు వారంతా పనులు లేక రోడ్డున పడ్డారు. పక్క గ్రామాల నుంచి కూడా కార్మికులు పనిచేసేవారు. దీనిని నమ్ముకుని లక్షలు వెచ్చించి పడవలు కొనుగోలు చేసినవారు నిస్సాహాయులయ్యారు. ప్రభుత్వం కనికరించి రీచ్‌ను వెంటనే తెరిపించి కార్మికులు, పడవ యజమానులకు న్యాయం చేయాలి.

– గుడేటి సలోమాన్, కార్మికుడు, కస్తల

➡ కానీ కస్తల రీచ్‌లో కేవలం కూలీలతో మాత్రమే నిర్వహించాలి. అలా చేస్తే కాంట్రాక్టర్లకు ధరలు రావన్న కారణంగా కస్తల జోలికి ఎవ్వరూ పోవడం లేదు. అధికారులు, పాలకులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే కస్తల రీచ్‌ను పునరుద్ధరించాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పురుగు మందులలో సరైన మోతాదుతో నీటిని కలపాలి



నకరికల్లు: పొలంలో పిచికారీ చేసే పురుగుమందులో సరైన మోతాదులో నీటిని కలుపుకోవడం ద్వారా సమర్థవంతమైన ప్రభావం చూపుతుందని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం పరిధిలో మండలంలోని చీమలమర్రి గ్రామంలో రైతులకు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా పల్లెల్లోని రైతులను కలసి సాగులో సాంకేతిక పరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పురుగు మందులలో నీటిని కలిపే విధానం, పిచికారీ చేసే విధానం, పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సుజిత, సునీత, వైష్ణవి, ఎస్.వైష్ణవి, రైతు సేవ కేంద్రం సహాయకుడు జగదీష్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ట

సత్తెనపల్లి: మండలంలోని కంకణాలపల్లి గ్రామంలో వీరాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తూనికలు, కొలతల్లో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

లీగల్ మెట్రాలజీ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా



ఏఎంసీ ఆవరణలోని రైతు బజార్‌లో మాట్లాడుతున్న షేక్ సైదా

సత్తెనపల్లి: తూనికలు, కొలతల్లో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని లీగల్ మెట్రాలజీ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా అన్నారు. తూనికలు కొలతలు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలోని రైతు బజార్‌లో వినియోగదారులకు, వర్తకులకు లీగల్ మెట్రాలజీ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ వినియోగదారులు కూరగాయలు, ఇతరత్రా కొనుగోలు చేసినప్పుడు వారికి కచ్చితమైన తూకం ప్రకారం విక్రయించాలని, అందుకు వాడేటువంటి కాటాలను ప్రతి సంవత్సరం లీగల్ మెట్రాలజీ ఆధ్వర్యంలో జరుగుతున్న స్టాంపింగ్‌కు పంపించి తప్పనిసరిగా రసీదు పొందాలని తెలిపారు. పల్నాడు జిల్లా వినియోగదారుల సంఘం(ఏంజెల్ ఫ్రైడ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్) జిల్లా సెక్రటరీ బెల్లంకొండ నాగసాయిప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులు కూరగాయలు, ఇతరత్రా కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కచ్చితమైన తూకం అడిగే హక్కు వినియోగదారునికి ఉందని, తూకాలలో తేడా ఉంటే సంబంధిత అధికారులకు గానీ, వినియోగదారుల సంఘం వారికి గానీ ఫిర్యాదు చేసే హక్కు ఉందన్నారు. అదేవిధంగా కాటాలు స్టాంపింగ్ చేసి ఉన్నాయో లేదో పరిశీలించుకునే హక్కు కూడా ఉందన్నారు. అనంతరం రైతు బజార్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న వర్తకులకు, వినియోగదారుకు వస్తువులు కాటా వేసే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం సత్తెనపల్లి (ఏంజెల్ ఫ్రైడ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్) ప్రతినిధులు వనమా నాగేశ్వరరావు, ఆవులమంద కమలాకర్, కొప్పురావూరి కాశీ వెంకట సుబ్బారావు, లీగల్ మెట్రాలజీ సిబ్బంది ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు



అచ్చంపేట: మండలంలోని కోనూరులో నూతనంగా నిర్మించిన గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి నూతన దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు గురువారం కనుల పండువలా జరిగాయి. ఈ సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవ, గణార్చనలు, పుణ్యాహవాచనం, వాస్తు పూజలు, మహారుద్ర హోమం, గర్తన్యాసం, దఫాతున్యాస, భీజన్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6.54 గంటలకు యంత్ర స్థాపన శిలా విగ్రహ ప్రతిష్ఠ జరిగాయి. అనంతరం దృష్టి స్థాపనలు, ధేనుదర్పణ దర్శనం, మహాకుంభాభిషేకములు, మహానివేదన, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం శాంతి హోమం నిర్వహించారు. పొరుగు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పొంగించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరిగింది.

రక్తం అందించి ప్రాణాలు కాపాడిన సంస్థ రెడ్ క్రాస్



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్ అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు

సత్తెనపల్లి: రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం అందించి అనేకమంది ప్రాణాలు కాపాడిన గొప్ప సంస్థ రెడ్ క్రాస్ అని డీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని గుంటూరు రోడ్‌లోని శివసదనంలో ప్రపంచ రెడ్ క్రాస్ సొసైటీ దినోత్సవంను పురస్కరించుకొని గురువారం సత్తెనపల్లి రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా ప్రపంచ రెడ్ క్రాస్ సొసైటీ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ స్థాపన, ప్రపంచంలో ఈ సొసైటీ సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం 30 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి, శిబిరానికి సహకారం అందించిన వారికి రెడ్ క్రాస్ సొసైటీ సత్తెనపల్లి గౌరవ అధ్యక్షుడు రావెల చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది నరిశేటి వేణుగోపాల్, రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా మేనేజ్ కమిటీ సభ్యుడు పుట్టి సాంబశివరావు, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, కోశాధికారి కాపుగంటి రత్తయ్య, కమిటీ సభ్యులు దేవరపల్లి మల్లికార్జునరావు, వల్లూరి శ్రీనివాసరావు, దనేకుల సాంబశివరావు తదితరులు ఉన్నారు.

భూమి ఆరోగ్యం కాపాడే చర్యలపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ అరుణ, పక్కన డీడీఏ శివకుమారి

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో రైతులకు భూమాత ఆరోగ్య పునరుద్ధరణ, పోషణ, ఆరోగ్య పెంపుదలపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి పాల్గొని రైతులకు భూమి ఆరోగ్యం కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎరువులు, క్రిమి సంహారక మందులు తక్కువ వినియోగించటం, బయో ఎరువులు వాడటం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ విధానం పాటించడం వలన భూమి ఆరోగ్యం బాగుపడటంతో పాటు, ఆ భూమిలో పండిన పంటలు తినడం వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ మాట్లాడుతూ పంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలోనే కలియదున్నటం వలన భూసారం పెరగటమే కాకుండా కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. వేసవి కాలంలో భూములు ఖాళీగా వదలకుండా మినుము, పెసర వంటి పంటలు వేసుకోవడం వలన అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమలశెట్టి సైదుబాబు, ఏఈఓ నరేష్, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



మట్టి నమూనాల సేకరణను పరిశీలిస్తున్న ఏవో కృష్ణయ్య

బెల్లంకొండ: భూసార పరీక్షలు చేయించడం ద్వారా భూమికి తగిన ఎరువులు అందించి అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య తెలిపారు. గురువారం మండలంలోని వెంకటాయపాలెం, పాపాయపాలెం, చంద్రాజుపాలెం, కందిపాడు గ్రామాలలో భూసార పరీక్షలను నిర్వహించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడడం వలన రసాయన ఎరువుల ఖర్చులు తగ్గడంతో పాటు, చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. పొలంలో జిగ్‌జాగ్ విధానంలో 8 నుంచి 10 ప్రాథమిక నమూనాలను 'వి'ఆకారపు గుంతలలో సేకరిస్తున్నామన్నారు. గట్లు పక్కన, చెట్టు నీడన, ఎరువు తోలినచోట, పల్లపు ప్రాంతాలలో మట్టి నమూనాలను సేకరించకూడదని సిబ్బందికి సూచించారు. అన్ని గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది మట్టి నమూనాలను సేకరిస్తున్నారని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు డి.రజిని, వ్యవసాయ సహాయకులు ప్రసాదరావు, రహమతుల్లా, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సూక్ష్మపోషకాల లోపాలు గుర్తింపు

నకరికల్లు: మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయడం ద్వారా భూమిలో సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలోని రైతుల పొలాల్లో గురువారం భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి సచివాలయం నుంచి 55 నుంచి 60 మట్టి నమూనాలు సేకరిస్తామన్నారు. 2025-26 ఏడాదికి గాను 800 మట్టి నమూనాలు సేకరించడం లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించడంతో పాటు సాగులో ఖర్చును తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిల్యాబ్ ద్వారా ఉచితంగా విత్తన, ఎరువుల పరీక్షలు

ఏడీఏ వి.హనుమంతరావు



క్రోసూరు: రైతు ప్రయోజనాల కొరకు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్‌లలో పెదకూరపాడు నియోజకవర్గ ల్యాబ్ ఒకటని రైతులు ఉచితంగా విత్తన, ఎరువులు, మట్టి పరీక్షలు పొందవచ్చునని ఏడీఏ హనుమంతరావు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని ఆధునిక, సాంకేతికత సమన్వయంతో రైతుల సమస్యలకు శాస్త్రీయ పరిష్కారం చూపి సాగును లాభదాయకంగా మార్చేందుకు పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. విత్తనాలలో మొలక శాతం, తేమ శాతం, భౌతిక పరీక్షలు ల్యాబ్‌లో ఉచితంగా చేయటం జరుగుతుందన్నారు. ఎరువులలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, సల్ఫర్ పరీక్షలు జరుపబడునని తెలిపారు. ఇప్పటి వరకు గత మూడు సంవత్సరాలుగా విత్తన నమూనాలు 690, ఎరువుల నమూనాలు 408 పరీక్షలు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అధీకృత లైసెన్సు వ్యాపారులు విత్తన నాణ్యత పరీక్షకు రూ.250, ఎరువుల నాణ్యత పరీక్షలకు ఒక్కొక్క దానికి రూ.1,000 గరిష్ఠంగా రూ.4 వేలు చెల్లించాలన్నారు. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని లేదా ఏవోను సంప్రదించి విత్తన, ఎరువుల పరీక్షలకు వాటి నమూనాలను అగ్రి ల్యాబ్‌లో అందజేస్తే ఏడు నుంచి 10 రోజుల్లో ఫలితాలు పొందవచ్చన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

బొల్లాపల్లి : ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యంను పరిశీలించి రసాయనిక పరీక్షకు శాంపిల్ బాటిల్‌ను సేకరించారు. దుకాణాల్లోని మద్యం ధరలను నిర్ధారించుటకు డెకొయ్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను దుకాణాదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

సత్తెనపల్లి: పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బూరు గ్రామానికి చెందిన ఒంటిపులి వాణి (28) కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త వెంకటేశ్వర్లు, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త వెంకటేశ్వర్లు పట్టణంలోని 9, 10 వార్డులకు సంబంధించిన 6వ సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా పని చేస్తున్నాడు. 8 ఏళ్ల క్రితం వీరికి వివాహం కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో సున్నిత మనస్కురాలైన వాణి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలి భర్త వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు వాణి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

పెదకూరపాడు: పెదకూరపాడు ఆర్సీఎం స్కూల్ ఆవరణలో ఈ నెల 11వ తేదీన కొమరబత్తిన రోజమ్మ, కారంశెట్టి జయరావు జ్ఞాపకార్థం పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాకులు కేఎల్ రాజు గురువారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలోని ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు తీసుకొని రావాలని అన్నారు. శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శంకర కంటి హాస్పటల్లో ఆపరేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

జాబ్ కార్డు ఉన్నవారందరికీ పని కల్పించాలి

ముప్పాళ్ళ: జాబ్ కార్డు ఉన్నవారందరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ కాశయ్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని అడిగిన ప్రతి ఒక్కరికీ పనితో పాటు వంద రోజుల పనిదినాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. పని ప్రాంతంలో నీడతో పాటు, వైద్య సదుపాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఫిర్యాదులు వస్తే వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏపీఓ ఏడుకొండలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను కాపాడండి

సత్తెనపల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గతంలో నెలకొల్పిన రైతు బజార్ కునారిల్లుతుందని, దానిని కాపాడాలని జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు గురువారం కోరారు. కొత్తగా వచ్చిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయం వల్ల రైతు బజార్ నష్టాల బాట పడుతుందన్నారు. ఎప్పుడూ లేని విధంగా వ్యవసాయ మార్కెట్ యార్డు లోపలకి వెళ్లే దారులు మూసేయడం వల్ల రైతు బజార్‌కు వెళ్లే వారి సంఖ్య బాగా తగ్గిపోయిందన్నారు. వినియోగదారులు కూడా రైతు బజార్‌కు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు.